మిస్ ఏఐగా మొరాకో సుందరి

న్యూఢిల్లీ: ప్రపంచంలోనే తొలిసారి నిర్వహించిన 'మిస్ ఏఐ' పోటీల్లో మొరాకోకు చెందిన ఇన్‌ఫ్లుయెన్సర్ కెంజాలేలి విజేతగా నిలిచి కిరీటాన్ని అందుకుంది. 1500 మంది కంప్యూటర్ మాడిఫైడ్ మోడళ్లను వెనక్కి నెట్టి తొలి వర్చువల్ అందాల పోటీ విజేతగా నిలిచింది. మానవుల్లా తనకు భావోద్వేగాలు తెలియనప్పటికీ విజయం సాధించినందుకు ఉత్సాహంగా ఉందని కెంజాలేలి పేర్కొన్నది. విజేతగా నిలిచిన ఆమెకు 20 వేల డాలర్ల ప్రైజ్‌మనీ దక్కింది. లేలీకి ఇన్‌స్టాగ్రామ్‌లో 1.9 లక్షల మంది ఫాలోవర్లు ఉన్నారు. ఫుడ్, కల్చర్, ట్రావెల్, ఫ్యాషన్, బ్యూటీ వంటి వాటిపై వీడియోలు చేస్తుంటుంది. మొరాకో సంస్కృతిని గర్వంగా ప్రదర్శించడమే తన ఆశయమని లేలి తెలిపింది. మహిళా పురోగతి, పర్యావరణాన్ని కాపాడడం, పాజిటివ్ రోబో కల్చర్‌పై అవగాహన పెంచేందుకు ఈ విజయం ద్వారా వచ్చిన పేరును ప్రఖ్యాతులను ఉపయోగించుకుంటానని వాగ్దానం చేసింది. ఏఐ అనేది మానవ సామర్థ్యాలను మరింత పెంచేందుకు రూపొందించబడిన సాధనం తప్ప వారిని భర్తీ చేసేది కాదని కెంజాలేలి స్పష్టం చేసింది. ఈ ఏఐ ముద్దుగుమ్మను ఫోనిక్స్ ఏఐ సీఈవో మెరియం బెస్సా సృష్టించారు.

అనసూయ.. ఇకపై అనుకతిర్ సూర్య

- ఐఆర్ఎస్ అధికారిణి పేరు, జెండర్ మార్పునకు కేంద్రం ఓకే
- సివిల్ సర్వీసెస్ చరిత్రలో మొదటిసారి

న్యూఢిల్లీ, జూలై 9: తన పేరు, జెండర్ మార్చాలంటూ ఓ ఐఆర్ఎస్ ఆఫీసర్ చేసుకున్న అప్పీల్‌పై కేంద్రం చరిత్రాత్మక నిర్ణయం తీసుకుంది. ఇండియన్ సివిల్ సర్వీసెస్ చరిత్రలో మొట్టమొదటిసారి.. ఓ ఐఆర్ఎస్ అధికారిణి పేరు, జెండర్‌ను అధికారికంగా మార్చటానికి ఆమోదం తెలిపింది. తన పేరును ఎం అనుకతిర్ సూర్యగా, తనను పురుషుడిగా గుర్తించాలని ఐఆర్ఎస్ ఆఫీసర్ ఎం అనుసూయ చేసుకున్న అభ్యర్థనను కేంద్ర ఆర్థిక శాఖ ఆమోదించింది. ఈ మేరకు కేంద్రం నుంచి మంగళవారం ఉత్తర్వులు వెలువడ్డాయి. సదరు ఐఆర్ఎస్ ఆఫీసర్ హైదరాబాద్ సీఈఎస్‌టీఏటీ జాయింట్ కమిషనర్‌గా ఉన్నారు. కేంద్రం నిర్ణయం 'ప్రగతి శీలమైంది'గా ఐఆర్ఎస్ ఆఫీసర్ పేర్కొన్నారు. దేశంలో లింగ వైవిధ్యం పట్ల సానుకూలతను తీసుకొస్తుందని అన్నారు.

చెదురుతున్న డాలర్ డ్రీమ్స్!

- అమెరికా ఐటీ రంగంలో సంక్షోభం
- లేఆఫ్స్ ప్రకటిస్తున్న దిగ్గజ కంపెనీలు
- పడిపోయిన కొత్త ఉద్యోగాల సృష్టి
- జాబ్స్ దొరక్క తెలుగువాళ్ల అవస్థలు
- ఏజెన్సీలకు చిక్కి అక్రమంగా జాబ్స్
- కేసుల పాలై జైలుకెళ్తున్న విద్యార్థులు

హైదరాబాద్, జూలై 9 (నమస్తే తెలంగాణ): భారతీయుల డాలర్ డ్రీమ్స్ చెదిరిపోతున్నాయి. అమెరికా ఐటీ రంగంలో ఏర్పడిన సంక్షోభం టెకీలకు కంటిమీద కునుకులేకుండా చేస్తున్నది. ఉన్న ఉద్యోగాలు ఊడి.. కొత్త ఉద్యోగాలు దొరక్క ముఖ్యంగా తెలుగు యువత టెన్షన్ పడుతున్నది. కొందరు విద్యార్థులు నకిలీ కంపెనీలకు చిక్కి కేసులపాలై జైలు కెళ్లాల్సిన పరిస్థితులు తెలెత్తున్నాయి. మరికొందరు కుటుంబాలు గడవడం కోసం చోరీలు పాల్పడుతున్న ఘటనలు వెలుగుచూస్తున్నాయి. చదువు, ఉద్యోగం నిమిత్తం 2022-23లో భారత్ నుంచి అమెరికాకు దాదాపు 2 లక్షల మంది వెళ్లారు. ఇందులో సుమారు 50 వేల మంది తెలుగువాళ్లు ఉన్నట్టు అంచనా. కంప్యూటర్ సైన్స్‌లో ఎంఎస్ చేసి, మరికొన్ని కోర్సులు చదివి జాబ్ కొట్టి డాలర్స్ సంపాదించడం వీరి కల. కొవిడ్ కాలానికి నేటికీ మధ్యలో దాదాపు 85 శాతం మందికి ఉద్యోగాలు వచ్చాయి. లక్షల కొద్దీ ప్యాకేజీలు పొందారు. కొవిడ్ ప్రభావం తగ్గిన తర్వాత అమెరికా ప్రభుత్వం ప్యాకేజీలను ఆపేసింది. పారిశ్రామిక రంగం పెద్దగా పుంజుకోలేదు. లాక్‌డౌన్ సమయంలో వివిధ సంస్థలు, వ్యక్తులకు ఇచ్చిన రుణాలు తిరిగి వసూలు కాకపోవడంతో బ్యాంకులు ఆర్థికంగా చితికిపోయాయి. ఫలితంగా రుణాలివ్వడం ఆపేశాయి. 4% ఉన్న వడ్డీ రేటును 8 శాతానికి పెంచేశాయి. దీని ప్రభావం పారిశ్రామిక రంగంపై పడింది. ఐటీ కంపెనీలకు ఒక్కసారిగా ఆర్డర్లు తగ్గిపోయాయి. చేయాల్సిన పనికంటే ఉద్యోగుల సంఖ్య అధికంగా ఉండటంతో ఉద్యోగులను 2023 మార్చి నుంచి తొలగించడం ప్రారంభించాయి. వేతనాలను తగ్గించేశాయి. ఫేస్‌బుక్, మైక్రోసాఫ్ట్, అమెజాన్, గూగుల్, ట్విట్టర్ (ఎక్స్).. ఇలా పెద్ద కంపెనీలు వేల మందిని ఉద్యోగులను తొలగించాయి. ఈ పరిణామాలన్నీ భారతీయులపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయి. తెలుగు రాష్ట్రాల నుంచి వెళ్లిన వేల మందికి ఎంఎస్ పూర్తిచేసినా ఉద్యోగాలు లభించడం లేదు.

కుటుంబం గడవడం కోసం నానాపాట్లు

అమెరికాలో రెండున్నర దశాబ్దాల్లో ఎన్నడూ లేనంత నిరుద్యోగ సంక్షోభం ఏర్పడింది. దీంతో కుటుంబ పోషణ కోసం కొందరు హోటళ్లతోపాటు పెట్రోల్ బంకుల్లోనూ పని చేస్తున్నారు. ఎడ్యుకేషన్ లోన్ ఎలా తీర్చాలని భయపడుతున్నారు. అమెరికాలో ఎంఎస్ పూర్తిచేసిన వెంటనే సంబంధిత యూనివర్సిటీ విద్యార్థి పేరిట ఓపీటీ ఐ20 (ఆప్షనల్ ప్రాక్టికల్ ట్రైనింగ్)ని విడుదల చేస్తుంది. దీని ద్వారా మూడు నెలల్లో ఏదో ఒక ఉద్యోగం చేయాలి. లేదంటే ఆ దేశాన్ని విడిచిపెట్టాలి.

అమెరికాలో తెలుగు భాషది 11వ స్థానం

2016 నాటికి అమెరికాలో తెలుగు వాళ్ల సంఖ్య 3.2 లక్షలు ఉండగా, 2024 నాటికి 12.3 లక్షలకు చేరింది. అమెరికాలో మాట్లాడే భారతీయ భాషల్లో తెలుగు మూడో స్థానంలో ఉన్నది. తొలి రెండు స్థానాల్లో హిందీ, గుజరాతీలు ఉన్నారు. అమెరికాలో సుమారు 350 భాషలు వాడుకలో ఉండగా, అందులో తెలుగు 11వ స్థానంలో నిలిచింది. ఏటా 60-70 వేల మంది విద్యార్థులు అమెరికాకు వెళ్తున్నారు. వీరితోపాటు సుమారు 10 వేల మంది హెచ్ 1బీ వీసా హోల్డర్లు ఉంటున్నారు. ఇందులో 80 శాతం మంది తెలుగు సంఘంలో సభ్యత్వం పొందుతున్నారు.

చందన్ దాసిరెడ్డి | ద్వారకా గుండా | సంతోష్ కట్కూరి | అనిల్ మాలె

నకిలీ కంపెనీలు నడుపుతూ జైలుకు..

ఐటీ రంగ సంక్షోభాన్ని, నిరుద్యోగుల అవసరాలను ఆసరాగా చేసుకొని కొందరు అక్రమ కంపెనీలు సృష్టించి విద్యార్థులతో బలవంతంగా పనిచేయిస్తున్నారు. ఇలా ఎంఎస్ లేదా ఓపీటీ విద్యార్థులతో బలవంతంగా పనిచేయిస్తున్న నలుగురు తెలుగువాళ్లను (చందన్ దాసిరెడ్డి, ద్వారకా గుండా, సంతోష్ కట్కూరి, అనిల్ మాలె) తాజాగా ప్రిన్స్‌టన్ పోలీసులు అరెస్టు చేశారు. వివిధ ప్రాంతాల్లో సుమారు 100 అక్రమంగా పనిచేస్తున్నట్టు విచారణలో తేలింది. ఒకే ఇంట్లో 15 మంది యువతులను గుర్తించారు. ప్రిన్స్‌టన్, మెలిసా, మెకెన్సీ ప్రాంతాల్లో నివాసాల్లో, అపార్ట్‌మెంట్లలో పెద్ద సంఖ్యలో యువతీ, యువకులతో బలవంతంగా పనిచేయిస్తున్నట్టు పోలీసులు గుర్తించారు. వారి నుంచి లాప్‌టాప్‌లు, సెల్‌ఫోన్లు, పింటర్లు సహా కీలపత్రాలను సీజ్ చేశారు.

మూన్‌లైటింగ్ ఉద్యోగులతో..

అమెరికాలో ఒక్కొక్కరు 2-3 ఉద్యోగాలు (మూన్‌లైటింగ్) చేస్తున్నారు. ఆ అవకాశం లేనివాళ్లకు కొత్త ఉద్యోగం రావడం లేదు. ఇప్పుడు చాలా మందికి జాబ్స్ పోతున్నాయి. కొత్తవి రావడం లేదు. డిపెండెంట్ వీసాపై(హెచ్-4) వచ్చిన వారికి కూడా ఇప్పుడు వర్క్ పర్మిట్ ఇస్తున్నారు. తొలుత భర్త వర్క్ పర్మిట్ వీసా (హెచ్-1బీ)పై వచ్చి ఉద్యోగం చేస్తూ.. డిపెండెంట్ వీసాపై వచ్చిన భార్యకు ఉద్యోగం కోసం దరఖాస్తు చేస్తున్నాడు. అలాంటి వాళ్లకు ఉద్యోగం రావడం లేదు.

-సందీప్ రాజనాల, అమెరికాలో ఐటీ ఉద్యోగి

అమెరికాలో మరో తెలుగు విద్యార్థి మృతి

జలపాతంలో జారిపడి దుర్మరణం

హైదరాబాద్ (నమస్తే తెలంగాణ)/న్యూయార్క్: అమెరికాలో మరో తెలుగు విద్యార్థి మరణించాడు. ఏపీకి చెందిన సాయి సూర్య అవినాశ్(25) అనే విద్యార్థి ప్రమాదవశాత్తూ ఓ జలపాతంలో పడి మృతిచెందారు. నూయార్క్‌లోని అల్బనీలో ఉన్న బార్బర్‌విల్లే జలపాతం చూసేందుకు స్నేహితులతో కలిసి వెళ్లిన అవినాశ్.. ప్రమాదవశాత్తూ అందులో జారిపడ్డాడు. ఈ ఘటన ఈ నెల 7న జరిగిందని న్యూయార్క్‌లోని భారత రాయబార కార్యాలయం మంగళవారం వెల్లడించింది. అవినాశ్ మృతదేహాన్ని భారత్‌కు పంపేందుకు తగిన ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపింది. తూర్పు గోదావరి జిల్లా గోపాలపురం మండలం చిట్యాల గ్రామానికి చెందిన అవినాశ్ ఎంఎస్ చదవడానికి యూఎస్ వెళ్లారు.

ఈవీఎంలతో రిస్క్

- బ్యాలెట్ పేపర్ ఉత్తమం
- టెస్లా అధినేత ఎలాన్ మస్క్

శాన్‌ఫ్రాన్సిస్కో: అమెరికా అధ్యక్ష ఎన్నికలు దగ్గర పడుతున్న వేళ టెస్లా, స్పేస్ ఎక్స్ సీఈవో ఎలాన్ మస్క్ మరోసారి ఈవీఎంల వాడకానికి వ్యతిరేకంగా గళమెత్తారు. ఈవీఎంల కన్నా పేపర్ బ్యాలెట్ మేలని నొక్కి చెప్పారు. 'ఈవీఎంలు, మెయిల్ చేసిన ఏ విషయమైనా చాలా రిస్క్‌తో కూడుకున్నది. మనం పేపర్ బ్యాలెట్‌నే అనుసరించాలి' అని మంగళవారం ఆయన ఎక్స్‌లో పోస్ట్ చేశారు. ఈ విషయానికి మద్దతుగా ఈవీఎంల గురించి కొన్ని అమెరికా వార్తా కథనాలను జత చేశారు.

ఎల్పీజీ ఈ-కేవైసీకి డెడ్‌లైన్ లేదు

కేంద్ర మంత్రి హర్దీప్

న్యూఢిల్లీ: ఎల్పీజీ సిలిండర్ల ఈ-కేవైసీ ధ్రువీకరణకు కాల పరిమితి లేదని కేంద్ర పెట్రోలియం శాఖ మంత్రి హర్దీప్ సింగ్ పురి మంగళవారం స్పష్టం చేశారు. కేరళ విపక్ష నేత సతీశన్ ఎక్స్‌లో పోస్ట్ చేసిన లేఖకు ప్రతిస్పందనగా ఈ విషయాన్ని వెల్లడించారు. వాణిజ్య సిలిండర్ల అక్రమ బుకింగ్‌ను నిరోధించి, బోగస్ ఖాతాలను తొలగించడం కోసమే ఈ-కేవైసీ ధ్రువీకరణ చేపట్టామన్నారు. ఓఎంసీ యాప్ ద్వారా లేదా డిస్ట్రిబ్యూటర్ షోరూమ్‌లలో ఈ ప్రక్రియను పూర్తి చేయవచ్చని తెలిపారు.

హిందీలో బీటెక్ కోర్సులు: జోధ్‌పూర్ ఐఐటీ

న్యూఢిల్లీ, జూలై 9: కొత్త అకడమిక్ సెషన్ నుంచి హిందీ మాధ్యమంలో బీటెక్ కోర్సులను ఆఫర్ చేయనున్నట్టు జోధ్‌పూర్ ఐఐటీ మంగళవారం ప్రకటించింది. ఈ ప్రతిపాదనకు ఇటీవల తమ సెనేట్ ఆమోదించినట్టు తెలిపింది. బీటెక్ మొదటి సంవత్సరం విద్యార్థులు ఎంచుకున్న ప్రాధాన్యతలను బట్టి వారిని రెండు సెక్షన్లుగా విభజిస్తామని, అనంతరం వారికి ఆంగ్లం, హిందీలో బోధన ప్రారంభిస్తామని వివరించింది. బోధన, అభ్యసన ప్రక్రియల్లో సమతూకాన్ని పాటించేందుకు వీలుగా ఇంగ్లిష్, హిందీ సెక్షన్ల విద్యార్థులకు ఒకే అధ్యాపకుడు బోధిస్తాడని తెలిపింది.

ఎస్ఎఫ్‌జేపై నిషేధం పొడిగింపు

న్యూఢిల్లీ: ఖలిస్థాన్ అనుకూల సంస్థ సిక్స్ ఫర్ జస్టిస్(ఎస్ఎఫ్‌జే) కార్యకలాపాలపై ఐదేండ్ల పాటు నిషేధాన్ని పొడిగిస్తూ కేంద్ర హోం శాఖ మంగళవారం నోటిఫికేషన్ జారీ చేసింది. ఈ నెల 10 నుంచి ఇది అమల్లోకి వస్తుందని తెలిపింది. చట్ట వ్యతిరేక కార్యకలాపాల(నిరోధక) చట్టం కింద ఆ సంస్థ జాతి వ్యతిరేక చర్యలను నిరోధించేందుకు, దేశ అంతర్గత భద్రతను, సమగ్రతను కాపాడేందుకు ఈ నిర్ణయం తీసుకున్నట్టు తెలిపింది. పంజాబ్, తదితర ప్రాంతాల్లో ఎస్ఎఫ్‌జే జాతి వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతూ.. దేశ సార్వభౌమత్వానికి భంగం కలిగించే రీతిలో వ్యవహరిస్తున్నదని వెల్లడించింది. దేశం నుంచి ఒక ప్రాంతం వేరు కావడాన్ని ఎస్ఎఫ్‌జే ప్రోత్సహిస్తున్నదని హోం శాఖ చెప్పింది.

బతికున్న పామును కొరికి తినేశాడు!

లక్నో, జూలై 9: చాలా ఏండ్ల పాటు జైల్లో ఉన్న ఓ ఘరానా దొంగ.. జైలు నుంచి బయటకు రాగానే చేసిన పని అక్కడి వాళ్లలో వణుకు పుట్టించింది. ఉత్తరప్రదేశ్‌లోని ఫతేపూర్‌లో పేరుమోసిన దొంగ గంగా ప్రసాద్. అతడిపై అనేక కేసులున్నాయి. ఇటీవలే జైలు నుంచి విడుదలయ్యాడు. ఇతడికి బతికున్న పాముల్ని పట్టుకుని.. వాటిని చంపి, తినే అలవాటుందట! జైలు నుంచి బయటకు వచ్చిన వెంటనే పాముల్ని తినేందుకు తపించిపోయాడు! నది ఒడ్డుకు పోయి.. నీళ్లలో నుంచి ఓ పామును తీసి, దాని మెడను కొరికి, కరకరా నమిలి తినేశాడు. ఇదే సమయంలో అక్కడున్న ఓ వ్యక్తి మొబైల్ ఫోన్‌లో వీడియో రికార్డ్ చేసి.. సోషల్ మీడియాలో పోస్ట్ చేశాడు. ఇన్నాండ్ల జైలు జీవితం అతడిలో ఎలాంటి మార్పూ తీసుకురాలేదని సోషల్ మీడియాలో పలువురు కామెంట్ చేశారు.

ఫేక్ వర్సిటీలతో జాగ్రత్త!

- అడ్మిషన్ల సమయంలో అప్రమత్తంగా ఉండాలి
- విద్యార్థులు, తల్లిదండ్రులకు యూజీసీ సూచన
- నకిలీ వర్సిటీల లిస్టు విడుదల

న్యూఢిల్లీ: ఉన్నత విద్యను అభ్యసించే క్రమంలో అందుకోసం విద్యాసంస్థను ఎంచుకొనే విషయంలో, అడ్మిషన్ తీసుకొనే ముందు విద్యార్థులు, తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాలని యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్(యూజీసీ) సూచించింది. నకిలీ కాలేజీ, యూనివర్సిటీల ఉచ్చులో చిక్కుకోవద్దని హెచ్చరించింది. అడ్మిషన్ల సీజన్ నేపథ్యంలో దేశవ్యాప్తంగా ఉన్న 21 ఫేక్ యూనివర్సిటీల జాబితాను తాజాగా విడుదల చేసింది. ఈ జాబితాలో అత్యధికంగా ఢిల్లీలో ఎనిమిది యూనివర్సిటీలు ఉన్నాయి.

రాష్ట్రాల వారీగా ఫేక్ వర్సిటీలు

- **ఢిల్లీ**

1. ఆలిండియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పబ్లిక్ అండ్ ఫిజికల్ హెల్త్ సైన్సెస్
2. కమర్షియల్ యూనివర్సిటీ లిమిటెడ్
3. యునైటెడ్ నేషన్స్ యూనివర్సిటీ
4. ఏడీఆర్-సెంట్రిక్ జ్యూరిడికల్ వర్సిటీ
5. ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్
6. విశ్వకర్మ ఓపెన్ యూనివర్సిటీ ఆఫ్ సెల్ఫ్-ఎంప్లాయిమెంట్
7. ఒకేషనల్ యూనివర్సిటీ
8. ఆధ్యాత్మిక్ విశ్వవిద్యాలయ

- **ఉత్తరప్రదేశ్**

1. గాంధీ హిందీ విద్యాపీఠ్, ప్రయాగ్, అలహాబాద్
2. నేతాజీ సుభాష్ చంద్రబోస్ యూనివర్సిటీ(ఓపెన్ యూనివర్సిటీ), అచ్చల్ తాల్, అలీగఢ్
3. భారతీయ శిక్షా పరిషత్, లక్నో
4. మహామయ టెక్నికల్ వర్సిటీ, నోయిడా

- **ఆంధ్రప్రదేశ్**

1. క్రిస్ట్ న్యూ టెస్టామెంట్ డీమ్డ్ యూనివర్సిటీ, గుంటూరు
2. బిబ్లే ఓపెన్ యూనివర్సిటీ ఆఫ్ ఇండియా, విశాఖపట్నం

- **కేరళ**

1. సెయింట్ జాన్స్ వర్సిటీ, కిషనట్టం
2. ఇంటర్నేషనల్ ఇస్లామిక్ యూనివర్సిటీ ఆఫ్ ప్రొఫెటిక్ మెడిసిన్(ఐఐయూపీఎం), కున్నమంగళం, కోజికోడ్

- **పశ్చిమబెంగాల్**

1. ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఆల్టర్నేటివ్ మెడిసిన్, కోల్‌కతా
2. ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఆల్టర్నేటివ్ మెడిసిన్ అండ్ రిసెర్చ్, కోల్‌కతా

- **కర్ణాటక**

1. బడగన్వి సర్కార్ వరల్డ్ ఓపెన్ వర్సిటీ ఎడ్యుకేషన్ సొసైటీ, గోకక్, బెల్గాం

- **మహారాష్ట్ర**

1. రాజా అరబిక్ యూనివర్సిటీ, నాగ్‌పూర్

- **పుదుచ్చేరి**

1. శ్రీబోధి అకాడమీ ఆఫ్ హయ్యర్ ఎడ్యుకేషన్

ఆన్‌లైన్‌లో నీట్-యూజీ!

జేఈఈ మెయిన్స్ తరహాలో..

కేంద్రప్రభుత్వ వర్గాల వెల్లడి

న్యూఢిల్లీ: ఈ ఏడాది నీట్-యూజీ నిర్వహణలో చోటుచేసుకున్న అక్రమాలపై దేశవ్యాప్తంగా ఆగ్రహం వ్యక్తమైంది. దీంతో వచ్చే ఏడాది నుంచి ఈ పరీక్షను చేపట్టే విధానంలో మార్పులు చేయబోతున్నట్టు సమాచారం! ప్రస్తుతం జేఈఈ-మెయిన్స్ పరీక్షను నిర్వహిస్తున్నట్టుగా, వచ్చే ఏడాది నుంచి నీట్-యూజీ పరీక్షను కూడా ఆన్‌లైన్ విధానంలో నిర్వహించనున్నట్టు వార్తలు వెలువడుతున్నాయి. 'పరీక్ష నిర్వహణలో తీసుకురావాల్సిన మార్పులపై ఏర్పాటైన సంబంధిత కమిటీ.. ఆన్‌లైన్ విధానంలో పరీక్షను నిర్వహించేందుకు మొగ్గు చూపుతున్నది. అయితే ఆ కమిటీ ఇంకా ఎలాంటి అధికారిక సిఫారసులు చేయలేదు' అని కేంద్ర ప్రభుత్వ వర్గాలు పేర్కొన్నాయి. ఈ అంశంపై మరో అధికారి మాట్లాడుతూ, 'దేశవ్యాప్తంగా ఈ పరీక్షను ఆన్‌లైన్‌లో నిర్వహించాలంటే 4వేల పరీక్ష కేంద్రాల్లో కంప్యూటర్లు, ఇతర వసతులు కల్పించాల్సి ఉంటుంది. ఇది ఒక సవాల్‌తో కూడుకున్న అంశం. జేఈఈ-మెయిన్స్‌ను నిర్వహించినట్టు ఆన్‌లైన్‌లో నీట్-యూజీని నిర్వహించటం మంచి ఆలోచనే' అని అన్నారు.

రష్యా సైన్యంలోని భారతీయులకు విముక్తి

- భారత్‌కు పంపేందుకు రష్యా ఓకే
- ముగిసిన ప్రధాని మోదీ రష్యా పర్యటన
- మోదీకి ఆ దేశ ప్రతిష్ఠాత్మక పురస్కారం

మాస్కో, జూలై 9: ఉక్రెయిన్‌తో యుద్ధం నేపథ్యంలో రష్యా తన సైన్యంలో నియమించుకొన్న భారతీయులను విముక్తి కల్పించేందుకు, వారిని వీలైనంత త్వరగా భారత్ పంపేందుకు మంగళవారం అంగీకారం తెలిపింది. రష్యా అధ్యక్షుడు పుతిన్‌తో జరిగిన భేటీలో ఈ అంశాన్ని భారత ప్రధాని మోదీ లేవనెత్తిన నేపథ్యంలో ఈ పరిణామం చోటు చేసుకొన్నదని అధికారిక వర్గాలు వెల్లడించాయి. రష్యా సైన్యంలో 35-50 మంది భారతీయులు పనిచేస్తుండొచ్చని విదేశాంగ శాఖ అంచనా వేసింది. ఇప్పటికే 10 మంది తిరిగి భారత్‌కు వచ్చేశారని విదేశాంగ శాఖ కార్యదర్శి వినయ్ తెలిపారు. మరోవైపు ఉక్రెయిన్‌తో వివాదానికి పరిష్కారం యుద్ధభూమిలో లభించదని, బాంబులు, బుల్లెట్ల మధ్య శాంతి ప్రయత్నాలు విజయవంతం కాలేవని ప్రధాని మోదీ అభిప్రాయపడ్డారు. పుతిన్‌తో భేటీ సందర్భంగా మోదీ ఈ వ్యాఖ్యలు చేశారు. కీవ్‌లోని ఓ చిన్నారుల దవాఖానపై రష్యా క్షిపణి దాడులపై మోదీ మాట్లాడుతూ పిల్లలను చంపడం చాలా బాధాకరమని, గుండెను పిండేస్తున్నదని అన్నారు. కాగా, అంతకుముందు పుతిన్‌ను మోదీ ఆలింగనం చేసుకోవడంపై ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. 'ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్యం దేశానికి చెందిన నాయకుడు ప్రపంచంలోనే అత్యంత కిరాతకుడిని కౌగిలించుకొన్నారు' అని ఎక్స్‌లో పోస్టు చేశారు.

మరో రెండు రష్యా నగరాల్లో కాన్సులేట్లు

ప్రధాని మోదీకి మంగళవారం రష్యా ప్రతిష్ఠాత్మక పురస్కారం 'ఆర్డర్ ఆఫ్ సెయింట్ ఆండ్రూ ది అపోస్టల్'ను పుతిన్ అందజేశారు. రెండు దేశాల మధ్య ద్వైపాక్షిక సంబంధాల బలోపేతానికి చేసిన కృషికి ఈ గౌరవం ఇచ్చారు. ఈ అవార్డు అందుకొన్న తొలి భారతీయ నేత మోదీనే. రష్యాలోని కజన్, యెకాటెరిన్‌బర్గ్ నగరాల్లో భారత రాయబార కార్యాలయాలను తెరువనున్నట్టు మోదీ తెలిపారు.

కూరగాయలు మరింత భగ్గు!

భారీ వర్షాలతో పంట నష్టమే కారణం

(స్పెషల్ టాస్క్ బ్యూరో)

హైదరాబాద్, జూలై 9 (నమస్తే తెలంగాణ): కొండెక్కిన కూరగాయల ధరలు మరింత పెరిగే అవకాశమున్నదని నిపుణులు చెబుతున్నారు. మొన్నటివరకూ వడగాడ్పులు, ఇప్పుడు కురుస్తున్న భారీ వర్షాలతో లక్షల ఎకరాల్లో పంట నష్టం జరిగినట్టు పేర్కొంటున్నారు. దీంతో విపణిలోకి కూరగాయల రాక తగ్గిపోతున్నదని గుర్తు చేస్తున్నారు. ఫలితంగా రానున్న రోజుల్లో ఉల్లిగడ్డలు, టమాట, ఆలుగడ్డ వంటి కూరగాయల రేట్లు మరింత పెరుగొచ్చని అంచనా వేస్తున్నారు. కొంత మంది దళారులు గోదాముల్లో కూరగాయల నిల్వలను ఉంచుకొంటున్నారని, దీంతో కృత్రిమ కొరత ఏర్పడుతున్నదని చెబుతున్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి తగిన చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

14న 'రత్న భాండార్' తెరవండి

ఒడిశా ప్రభుత్వానికి ఉన్నత స్థాయి కమిటీ సిఫారసు

భువనేశ్వర్, జూలై 9: పూరీ జగన్నాథ ఆలయం 'రత్న భాండాగారం' లోపలి గది (ఇన్నర్ ఛాంబర్)ని జూలై 14న తెరవాలంటూ ఉన్నత స్థాయి కమిటీ ఒడిశా ప్రభుత్వానికి సిఫారసు చేసింది. సంపద లెక్కింపు, భాండాగారం మరమ్మతులను పర్యవేక్షించేందుకు ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఈ కమిటీ మంగళవారం సమావేశమై ఈ మేరకు నిర్ణయం తీసుకున్నది. 'రత్న భాండాగారం రహస్య గదిని ఈ నెల 14న తెరవాలని నిర్ణయించాం. ఆ లోపు నకిలీ కీ సమర్పించాలని జగన్నాథ్ ఆలయ అడ్మినిస్ట్రేషన్ పాలనాధికారిని ఆదేశించాం. నకిలీ కీ పనిచేయకపోతే గది తాళాలను బద్దలు కొట్టాలని నిర్ణయించాం' అని కమిటీ సభ్యుడు ఒకరు తెలిపారు. రత్న భాండాగారాన్ని చివరిసారిగా 46 ఏండ్ల క్రితం 1978లో తెరిచారు.

ఆవాస్ యోజన సొమ్ము అందగానే

ప్రేమికులతో పరార్!

యూపీలో భర్తలను వదిలేసి వెళ్లిపోయిన 11 మంది

లక్నో, జూలై 9: పేదలు ఇండ్లు నిర్మించుకోవడానికి కేంద్రం ఇచ్చే ప్రధానమంత్రి ఆవాస్ యోజన(పీఎంఏవై) డబ్బులను కొందరు మహిళలు దుర్వినియోగం చేస్తున్నారు! ఈ పథకం ద్వారా మొదటి విడత ఆర్థిక సాయం అందుకున్నాక యూపీలో 11 మంది వివాహితలు భర్తలను వదిలేసి ప్రేమికులతో ఉడాయించారు. దీంతో రెండో విడత సాయాన్ని ఆపాలని ప్రభుత్వం నిర్ణయించింది. మహరాజ్ గంజ్ జిల్లాలో మొత్తం 2,350 మంది పీఎంఏవై లబ్ధిదారులు ఆర్థిక సాయం అందుకోగా.. అందులో 11 మంది వివాహితలు డబ్బు అందాక ప్రేమికులతో కలిసి పారిపోయారు.

టైర్లులేని క్యాప్సుల్ కారు

ఒక్క ఛార్జింగ్‌తో 80 కిలోమీటర్లు రయ్ రయ్

(స్పెషల్ టాస్క్ బ్యూరో)

హైదరాబాద్, జూలై 9 (నమస్తే తెలంగాణ): 'జురాసిక్ వరల్డ్' సినిమా చూశారా? అందులో డైనోసార్ల నుంచి ప్రాణాలు కాపాడుకోడానికి హీరో టీమ్.. టైర్లులేని ఓ క్యాప్సుల్ కారులో వెళ్లడం చూసి అబ్బురపడ్డాం కదూ. ఇప్పుడు సూరత్‌కు చెందిన ముగ్గురు ఇంజినీరింగ్ విద్యార్థులు కూడా ఇలా టైర్లులేని ఓ క్యాప్సుల్ కారును తయారు చేశారు. కరెంటుతో నడిచే ఈ కారును ఒక్కసారి పుల్లుగా చార్జీ చేస్తే ఏకధాటిగా 80 కిలోమీటర్ల వరకూ పరుగెడుతుంది. కారు గరిష్ఠ వేగం గంటకు 35 కిలోమీటర్లు. ధర రూ. 65 వేలు. గాలి కాలుష్యం, పెట్రోల్ రేట్లు భగ్గుమంటున్న నేపథ్యంలో తమ క్యాప్సుల్ కారుకు డిమాండ్ ఉంటుందని తయారీదారులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. కాగా సూరత్ రోడ్లమీద రయ్యిమని పరుగెడుతున్న ఈ కారును చూడటానికి జనం గుమిగూడుతున్న వీడియోలు సోషల్‌మీడియాలో వైరల్‌గా మారాయి.

డార్క్ చాక్‌లెట్‌తో చిగురు వ్యాధులు దూరం!

న్యూఢిల్లీ: డార్క్ చాక్‌లెట్లతో చిగురు సంబంధింత వ్యాధుల ముప్పు తగ్గుతుందని తాజా అధ్యయనంలో తేలింది. డార్క్ చాక్లెట్లలో ఉండే యాంటీఆక్సిడెంట్సే ఇందుకు కారణమని పరిశోధకులు తెలిపారు. ఈ చాక్లెట్లను తినడం వల్ల చిగురు సంబంధిత వ్యాధుల ముప్పు 54 శాతం వరకు తగ్గుతుందని వెల్లడించారు. చైనాలోని చాంగ్‌కింగ్ మెడికల్ యూనివర్సిటీ పరిశోధకుల అధ్యయనంలో ఈ వివరాలు వెల్లడయ్యాయి.